క్లుప్తంగా

జగనన్నపై నిందలు సరికాదు


శ్రీనివాసరావు

పూసపాటిరేగ : ప్రైవేటు వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందితే మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డే కారణమని అధికార పార్టీ నాయకులు ఆయనకు ఆపాదించడం ఎంత వరకు సమంజసం అని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాని శ్రీనివాసరావు ప్రశ్నించారు. మండల కేంద్రం పూసపాటిరేగలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నాయకులు ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేయడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అన్నారు. పల్నాడు జిల్లా రెంటపాళ్లలో అభిమాన నేత జగన్‌మోహన్‌రెడ్డిని చూడటానికి భారీగా జనం రావడంతో అధికార పార్టీ నాయకులు తట్టుకోలేక నిందలు మోపుతున్నారన్నారు. ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజలు తిరుగుబాటు ప్రారంభమైందన్నారు.

వరి విత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

డెంకాడ: మండలంలోని అమకాం గ్రామంలో రైతులకు వరి విత్తనాలను గురువారం పంపిణీ చేశారు. ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు చేతుల మీదుగా విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనాలు మొదలుకుని ఎరువుల వినియోగం వరకూ తగిన మోతాదులో వినియోగించాలన్నారు. అధిక వినియోగం వలన అనర్థాలు ఉంటాయని చెప్పారు. మండల వ్యవసాయాధికారి టి.సంగీత మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల వారీగా వరి విత్తనాలను మొలక కట్టడం జరిగిందన్నారు. 99 శాతం మొలక వచ్చిందన్నారు. విత్తనాలను శుద్ధి చేయడం వలన పలు రకాల తెగుళ్లను నివారించవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు బలసా అప్పారావు, గ్రామ పెద్దలు దిండి కోటి, రాపంల్లి లోకేష్, పాల శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి కంచేరులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


రెడ్డి కంచేరులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

భోగాపురం: మండలంలోని రెడ్డి కంచేరు గ్రామంలో విద్యుత్ సమస్యపై ఆ శాఖ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. గ్రామంలో యథేచ్ఛగా విద్యుత్ చౌర్యం శీర్షికతో ఈ నెల 8న సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి స్పందించిన అధికారులు పాత ట్రాన్స్‌ఫార్మర్లను తీసేసి అధిక విద్యుత్ లోడు ఉన్న కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కార్మికులపై కనికరం లేని కూటమి సర్కారు

విజయనగరం గంటస్తంభం: ఉత్తరాంధ్రలోని మూత పడ్డ తాండవ, ఏటికొప్పాక, అనకాపల్లి, భీమసింగి నష్టాల్లో తిరుగుతున్న చోడవరం సహకార చక్కెర ఫ్యాక్టరీలపై కూటమి సర్కారు యోగాకు ఖర్చు చేసిన దాంట్లో సగం పెట్టి ఉంటే ఉత్తరాంధ్ర అభివృద్ధితో పాటు రైతులకు చాలా లాభం చేకూరేదని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గడిచిన నెల రోజుల నుంచి ఉత్తరాంధ్రలోని ఏ ఒక్క అధికారి ప్రజా సమస్యలపై పని చేయని పరిస్థితి నెలకొందని ఎవ్వరితో మాట్లాడినా యోగాంధ్ర మీటింగ్, యోగాంధ్ర ఏర్పాట్లు అని చెప్పే వారని మొత్తంగా ఉత్తరాంధ్ర పరిపాలన వ్యవస్థ పూర్తి స్థాయిలో కుంటుపడిందని పేర్కొన్నారు. బాధ్యత కలిగిన కొంత మంది అధికారులు, సిబ్బంది కూడా విసిగిపోయి పని చేస్తున్నారని భీశెట్టి ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈవెంట్లపై దృష్టి సారించకుండా ఉత్తరాంధ్రలోని మూతపడ్డ పరిశ్రమలపై, యువతకు ఉపాధి అవకాశాల కోసం, రైతులకు లాభసాటి వ్యవసాయం కోసం దృష్టి సారించాలని కోరారు. సహకార సుగర్ ఫ్యాక్టరీలు లాభసాటి కాకపోతే వారిని కేంద్ర ప్రభుత్వం సహాయంతో ఇథనాల్ పరిశ్రమలుగా మార్చి రైతులకు లాభసాటిగా చెయొచ్చని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రతినిధి అల్లంశెట్టి నగభూనణం, పౌర వేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్రరాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సంక్షేమంపై ఆంక్షలు

- తల్లికి వందనానికి దూరంగా అంగన్‌వాడీ సిబ్బంది పిల్లలు
- రేషన్ సరుకుల కోసం తిప్పలు
- కూటమి సర్కారు తీరుపై తీవ్ర అసంతృప్తి


కొప్పెర్ల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

పూసపాటిరేగ : అంగన్‌వాడీలపై సర్కారు చిన్న చూపు చూస్తోంది. చాలీచాలని జీతాలతో కాలం వెళ్లదీస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల కుటుంబాలకు మంజూరయ్యే సంక్షేమ పథకాలపై ఆంక్షలు విధించడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాదిగా విద్యార్థుల తల్లులకు వేయని అమ్మ ఒడి పథకాన్ని తాజాగా తల్లికి వందనం పేరిట అకౌంట్‌లలో వేసిన సర్కారు, అరకొర జీతంతో గడుపుతున్న అంగన్‌వాడీల పిల్లలకు మంజూరు చేయకుండా తల్లికి వందనానికి దూరం పెట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పిల్లలు, గర్భిణులు, తల్లులు ఫొటోలతో కూడిన వివరాలను పోషణ్ ట్రాకర్, బాలసంజీవిని యాప్‌లలో అప్‌లోడ్ చేయాలనే ఆదేశాలతో కార్యకర్తలు ఒత్తిడికి గురవుతున్నారు. ఎంతో నిబద్ధతతో సేవలు అందించే అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పట్ల కూటమి సర్కారు అవలంభిస్తున్న విధానంతో విసిగిపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పిల్లలకు సంక్షేమ పథకాలు అకౌంట్‌లలో జమయ్యేవి. తాజాగా తల్లికి వందనం పేరిట విద్యార్థులు తల్లుల అకౌంట్‌లలో జమయ్యే పథకం వేయకుండా కోత విధించారు.

మరో వైపు అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన నిత్యవసర సరుకులు అన్నీ గతంలో నేరుగా కేంద్రాలకు వచ్చేవి. గత నెల నుంచి బియ్యం, కందిపప్పు, పంచదార వంటి సరుకులు డీలర్ వద్దకు వెళ్లి తెచ్చుకోవడం ఇబ్బందిగా మారిందని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషను షాపులు నుంచి సరుకులు తెచ్చుకోవడానికి రవాణా చార్జీలు భరించాల్సిందేనని ఇబ్బంది పెడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించాలంటే భారంగా మారిందని పలువురు అంగన్‌వాడీలు అంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహణ నిధులు సకాలంలో పడకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత భవనాలు లేని చోట అద్దె భవనాలకు ప్రభుత్వం మంజూరు చేసిన అద్దె చాలక కార్యకర్తలు సొంత నిధులు పెట్టాల్సిన పరిస్థితి. భోగాపురం ఐసీడీఎస్ సెక్టారు పరిధిలో 272 అంగన్‌వాడీ కేంద్రాలు వున్నాయి. వాటిలో 210 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 62 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు, ఆయా కేంద్రాలు పరిధిలో కార్యకర్తలు నాణ్యమైన విద్యే లక్ష్యంగా పని చేస్తున్నప్పటికి సౌకర్యాలు అందించడంలో ప్రభుత్వం విఫలం అవుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సంక్షేమ పథకాలు మంజూరు చేయాలి

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు సంక్షేమ పథకాలు మంజూరు చేయాలి. అంగన్‌వాడీ సిబ్బందికి జీతాలు పెంచని సర్కారు సంక్షేమ పథకాలలో కోత విధించడం దారుణం. తల్లికి వందనంతో పాటు మిగతా సంక్షేమ పథకాలు అంగన్‌వాడీ సిబ్బంది పిల్లలకు వర్తింప చేయాలి. అంగన్‌వాడీ కార్యకర్తలను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వంపై పోరాటం చేస్తాం.

– బి.సూర్యనారాయణ, సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు

సమస్యలు పరిష్కరించాలి

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి. ఆయాలు, కార్యకర్తలు పిల్లలకు తల్లికి వందనం వర్తింప చేయాలి. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే రేషను నేరుగా కేంద్రాలకు సరఫరా చేయాలి. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ కార్యకర్తలు సమస్యలు పరిష్కరించాలి.

– అప్పలనాయుడు, సామాజిక కార్యకర్త, పూసపాటిరేగ

కార్మికుల బైక్ ర్యాలీ



మున్సిపల్ ఇంజినీరింగ్ వాటర్ వర్క్స్, పర్యావరణ, ఎలక్ట్రికల్, నాన్ పీహెచ్ కార్మికులందరికీ బేసిక్ వేతనం రూ.21000, టెక్నికల్ వేతనం రూ.24,500 చెల్లించాలని కోరుతూ.. ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం విజయనగరంలోని బాలాజీ నగర్ వాటర్ ట్యాంక్ నుంచి కొత్తపేట వాటర్ ట్యాంక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ నాన్ పీహెచ్ కార్మికులకు ప్రభుత్వం జీతాలు పెంచుతూ తక్షణమే జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, రిటర్మెంట్ బెనిఫిట్, 62 సంవత్సరాల వరకు కొనసాగించాలని నినదించారు. సీఐటీయూ నగర కార్యదర్శి బి.రమణ, మున్సిపల్ యూనియన్ నాయకులు ఎ.జగన్మోహన్‌రావు ఎస్.రామునాయుడు, భాస్కరరావు, వెంకటేష్, ధనుంజయ, సత్యనారాయణ, రాజు, ఉమామహేశ్వరరావు, తిరు తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం గంటస్తంభం

నిబంధనలతో అన్నదాతకు అన్యాయం చేయొద్దు...

నెల్లిమర్ల: అన్నదాత సుఖీభవ పథకంలో నిబంధనల పేరిట రైతులకు అన్యాయం చేయడం దుర్మార్గమని రైతు సంఘం నాయకుడు కిల్లంపల్లి రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయడానికి నిబంధనల పేరిట అన్నదాతకు అన్యాయం చేయడం దుర్మార్గమన్నారు. సర్వే తప్పులు తడకగా మారి రైతులకు లేని భూమిని ఎక్కువగా చూపించడం, జిరాయితీ భూములు ప్రభుత్వ భూములుగా నమోదు కావడం వల్ల అన్నదాత సుఖీభవ పథకం పొందలేకపోతున్నారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం వాటిని చూపించి నిబంధనల పేరిట రైతుకి సుఖీభవ పథకం అందకపోవడం జరుగుతుందని తెలిపారు. రీసర్వేలో జరిగిన తప్పులు సరి చేయమని రైతులు విన్నవించుకున్నా పట్టించుకునే నాధుడు లేడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిబంధనల పేరిట అన్నదాత సుఖీభవ పథకాన్ని నిర్వీర్యం చేయకుండా రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మానవ జీవన చైతన్య దీప్తి యోగా

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు


యోగాసన ప్రదర్శనలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: మనస్సు శరీరం, ఆత్మలను యోగా సంయోగపరిచి చైతన్యం కలిగిస్తుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల యోగా ప్రదర్శనను వీక్షించడంతో పాటు స్వయంగా ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న విశాఖ వేదికగా యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ కూడా పాల్గొంటున్నారని తెలిపారు. భారతీయుల జీవన విధానంలో యోగా అంతర్భాగమైందని వర్తమాన జీవన విధానంలో ఒడిదుడుకులను తట్టుకోవడానికి ఆరోగ్యవంతమైన జీవనానికి యోగా ఎంతో ఉపకరిస్తుందన్నారు. యోగాలోని అష్టాంగ మార్గాలు సామాజిక, వైయుక్తిక ప్రయోజనాలకు దోహదపడతాయన్నారు. బహుళ ప్రయోజనాలను అందిస్తున్న యోగాను భవిష్యత్ తరాలను అందించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.ఉమాలక్ష్మి, పీడీ వెంకటలక్ష్మి తదితర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

- నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: జిల్లా యంత్రాంగం నిర్దేశించిన ప్రకారం ప్రణాళికబద్ధంగా వ్యవహరించి 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సచివాలయ కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు సచివాలయ కార్యదర్శులతో గురువారం విడతల వారీగా సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో నిర్వహించ తలపెట్టిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని శతశాతం విజయవంతం చేసే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఇందులో భాగంగా సచివాలయ కార్యదర్శులకు నిర్దేశించిన విధంగా ప్రజలను యోగా వేదికల వద్దకు తరలించాలని సూచించారు. ఆ రోజు ఉదయం 3 గంటలకే తప్పనిసరిగా సచివాలయాల నుంచి బస్సులు ప్రజలతో తరలించే విధంగా చూడాలన్నారు. అదే రోజు సచివాలయాల పరిధిలో ఉదయం 6:30 గంటలకు యోగా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం రాజీవ్ స్టేడియంలో జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని చెప్పారు. సమావేశంలో టీపీఆర్‌వో సింహాచలం పాల్గొన్నారు. యోగా ద్వారా శారీరకంగా మానసికంగా ఏకీకృతం చేసి వసుధైక ఆరోగ్య కుటుంబాన్ని ఏర్పాటు చేసేందుకు యోగాంధ్ర 2025 కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని విజయనగరం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు అన్నారు. గురువారం కోట వద్ద యోగాసనాలను నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


39వ డివిజన్‌లో ప్రజా సమస్యలపై ఆరా తీస్తున్న సహాయ కమిషనర్

విజయనగరం: ప్రజా సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తున్నామని కార్పొరేషన్ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు తెలిపారు. నగరంలోని 39వ డివిజన్ పరిధిలో గురువారం నిర్వహించిన వార్డు సందర్శన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆర్అండ్‌బీ జంక్షన్ నుంచి ప్రారంభమైన వార్డు సందర్శన కార్యక్రమంలో పలు అంశాలను గుర్తించారు. కాలువలు, రహదారులు, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలపై ప్రజాభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే తాగునీటి పంపిణీ నిర్ణీత వేళలకు జరుగుతున్నాయా లేదా అని అడిగారు. నీటి నాణ్యత పరీక్షలను జరిపి అన్ని సక్రమంగా నిర్వహిస్తున్నట్టు సహాయ కమిషనర్ దృష్టికి ఏమినిటీస్ కార్యదర్శి తీసుకువచ్చారు. వార్డు సందర్శన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, కమిషనర్ పల్లి నల్లనయ్య సూచనలతో ప్రతివారం ఒక్కో డివిజన్‌లో పర్యటిస్తూ స్థానిక సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే ప్రతి డివిజన్‌కు రూ.20 లక్షల చొప్పున అభివృద్ధి పనులు నిమిత్తం వెచ్చిస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వింత ప్రభాకరరెడ్డి, నగరపాలక సంస్థ సీతారామమూర్తి, సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అమృతాహారంతో యోగా.. ఆరోగ్యం


ఉచిత శిక్షణా తరగతుల్లో విద్యార్థులకు యోగా ఆసనాలు నేర్పుతున్న శిక్షకుడు కొరుపోలు

- ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ఓ టీచర్ ప్రచార బాట

విజయనగరం అర్బన్: శారీరక దారుఢ్యం, మానసిక పురోగతి సమతుల్యంగా అందించే ప్రక్రియలో యోగాకు ప్రత్యేక స్థానం ఉంది. యోగాసనాలు చేస్తూ, ప్రకృతిలో లభించే కంద మూలాలను తింటే నిత్యం ఉల్లాసంగా ఉత్తేజంగా ఉంటారు. 'ఆరోగ్య భోగ' భాగ్యాలతో తులతూగినట్లే అంటున్నారు పట్టణానికి చెందిన యోగా ప్రావీణ్యుడు, రిటైర్డ్ అవార్డు ఉపాధ్యాయుడు కొరుపోలు సత్యారావు. ఆయన వృత్తి విద్యాబోధన.. ప్రవృత్తి యోగా ప్రచారం. యోగా ప్రాచుర్యం వల్ల ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చనే నిజాన్ని తెలియజేయాలనే లక్ష్యంగా తీసుకొని కృషి చేస్తున్నారు. ఆయన నివాస ప్రాంగణంలోనే ఉచితంగా యోగా నేర్పుతున్నారు. బాల్యం నుంచి అన్ని వయసుల వారికి యోగా దిన చర్యలుగా ఉంటూ సమీకృత ఆహారం అలవాటుగా సాగాలని అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం తయారవుతుందని ఆయన నమ్మకం.

యోగాతో ఆరోగ్యం

శీర్షాసనం: రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం కాంతివంతంగా మారుతుంది. గుండె, మెదడుకు రక్తప్రసరణ చక్కడా అందుతుంది.

ఉగ్రాసనం: నడుం వద్ద కొవ్వు తగ్గుతుంది. ఆకలి పెరుగుతుంది. బీపీ, షుగర్ కంట్రోల్ అవుతుంది.

ప్రాణాయామం: శ్వాస సంబంధమైన వ్యాధులు పటాపంచలవుతాయి. ప్రాణాయామంతో శరీరం ఆధీనంలోనే ఉండటంతో పాటు మానసిక ధైర్యం వృద్ధి చెందుతుంది.


మత్స్యాసనం: అన్ని అవయవాలకు మేలు కలుగుతుంది.

శవాసనం: స్వరపేటికకు మంచి వ్యాయామం. గొంతు కండరాలకు మేలు కలుగుతుంది. వెన్ను గట్టి పడుతుంది.

హలాసనం: శరీరం గట్టి పడటంతో పాటు యవ్వనంగా మారుతారు. వర్తులాసనంలో కూడా ఇవే లక్షణాలుంటాయి.

సర్వాంగాసనం: జుట్టు నెరపకుండా ఉంటుంది. శరీరానికి రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. చర్మ వ్యాధులు విచారించబడతాయి. కళ్లు కాంతివంతంగా మారుతాయి.

ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలి


మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణప్రసాద్

విజయనగరం లీగల్: ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని ఒక్క తల్లిని తప్ప ఎవరిని నమ్మలేని పరిస్థితులు ఉన్నాయని, తల్లిదండ్రుల చెప్పిన మాటలు తప్పక వినాలని జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. బాబామెట్టలో ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో గురువారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను వారు ఖండించారు. బాలికలు అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు. ప్రతి రోజు పేపర్ చదివే అలవాటు చేసుకోవాలని అందువలన సమాజంలో జరిగే పరిస్థితులు అర్థం అవుతాయని హితువు పలికారు. విద్యా హక్కు చట్టం గురించి, బాల కార్మిక వ్యతిరేక చట్టం గురించి, యాచక బాలల నిరోధం గురించి విద్యార్థులకు తెలిపారు. 14 ఏళ్లలోపు బాలబాలికలు స్కూల్‌లోనే ఉండాలని వారిని పనికి పంపరాదని హితవు పలికారు. ఎవరైనా బాలలను పనిలోగాని దుకాణాలలోగాని పనిచేయించినట్లయితే అట్టివారు శిక్షార్హులని తెలిపారు. బాలికలతో ముఖాముఖిగా చర్చించి వారి యొక్క సందేహాలు, సమస్యలు ఏవైనా ఉన్నట్లయితే తమకు తెలియజేయాలని సూచించారు. ఎవరైనా బాలికలకు ఇబ్బందులకు గురి చేస్తే వాటిని తమ దృష్టికి తీసుకువస్తే వారిపై న్యాయపరమైన చర్యలు ఉంటాయని తెలియజేశారు. బాలికలకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఎప్పుడు అండగా ఉంటుందని వారు ఏ సమయంలోనైనా జాతీయ న్యాయ సేవ అధికారి సంస్థ టోల్ ఫ్రీ నంబరు 15100 ఫోన్ చేసి వారి సమస్యలను తెలియజేయాలని సూచించారు. అవగాహన సదస్సులో స్కూల్ హెచ్ఎం పి.రమణమ్మ, న్యాయవాది పి.వి.వరలక్ష్మి, బెజ్జిపురం ఎన్జీవో కో–ఆర్డినేటర్ జి.ఝాన్సీ, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల్లో బదిలీల గుబులు

- 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి తప్పనిసరి బదిలీ
- కార్పొరేషన్ పరిధిలోని 61 సచివాలయాల్లో 542 మంది ఉద్యోగులు
- పూర్తి స్థాయి విధి విధానాలను ఖరారు చేయని మున్సిపల్ శాఖ



విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని వార్డు సచివాలయం

విజయనగరం:

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుణ్యమా అని కొలువులు దక్కించుకున్న సచివాలయాల ఉద్యోగుల్లో గుబులు ప్రారంభమైంది. సచివాలయాల్లో ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటంతో ఎక్కడికి బదిలీ అవుతుందోనన్న ఆందోళన ఉద్యోగులను వెంటాడుతోంది. ఈ నెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఈ ఏడాది మే 31 నాటికి ఒకే చోట ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసిన వారు, స్థానికంగా పనిచేస్తున్న వారు తప్పనిసరిగా వెళ్లాలని మార్గదర్శకాలు వచ్చాయి. దూరం వెళ్లేందుకు ఇష్టపడని ఉద్యోగులు ఎమ్మెల్యేల చుట్టూ సిఫార్సు లేఖల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు.

హేతుబద్ధీకరణ ఆధారంగా..

బదిలీ ప్రక్రియ ఈ నెలాఖరులోపు పూర్తి చేసేందుకు జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే జనాభా ఆధారంగా సచివాలయాలను గ్రేడ్‌లుగా, క్లస్టర్లుగా విభజించారు. గ్రేడుల ఆధారంగా ఉద్యోగులను హేతుబద్ధీకరించారు. గతంలో సచివాలయానికి 8 నుంచి 11 మంది ఉద్యోగులు ఉన్నారు. గ్రేడ్‌ల విభజన తర్వాత ఏ కేటగిరీలో ఆరుగురు, బీ కేటగిరీలో ఏడుగురు, సీ కేటగిరీలో ఎనిమిది మంది ఉద్యోగులు ఉండనున్నారు. మిగిలిన వారిని ఇతర శాఖల్లో సర్దుబాటు చేయనున్నట్టు సమాచారం.

కార్పొరేషన్ పరిధిలో ఇదీ పరిస్థితి...

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అధికారిక లెక్కల ప్రకారం 61 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో ఎనర్జీ కార్యదర్శులు 12 మంది మినహాయిస్తే మరో 542 మంది వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో 90 శాతం మంది కార్యదర్శులకు బదిలీలు తప్పనిసరిగా మారింది. మొత్తంలో 542 మందిలో 213 మంది ఉమెన్ ప్రొటెక్షన్, వైద్య ఆరోగ్యం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన కార్యదర్శులు ఉండగా.. మరో 329 మంది వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. సచివాలయ ఉద్యోగులకు బదిలీలు ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు విధి విధానాలు ఖరారు చేయకపోవటం కార్యదర్శుల్లో ఆందోళన కలిగిస్తోంది. వాస్తవానికి విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులకు స్థానికంగా బదిలీలు ప్రక్రియ నిర్వహిస్తారా...పక్కా జిల్లాలకు బదిలీ చేస్తారన్న అంశాన్ని మున్సిపల్ శాఖ నుంచి స్పష్టత రావాల్సి ఉంది.